## అమెరికాలక్షేపం - 1

# తెలుగు చేతి వ్రాత రాత?

*వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్*

*(ఫిబ్రవరి 29, 2004)*

క్రిందటి శుక్రవారం రాత్రి, మర్నాడు "కూలి"కి వెళ్ళక్కర్లేదు కదా అని రెండు "చుక్కలు" ఎక్కువ వేసుకుని పడుకున్నాను. శనివారం తెల్లారగట్ల నాలుగు గంటల నలభై రెండు నిముషాలకి మా ఆవిడ నన్ను నడ్డిమీద చరిచేసి నిద్రలేపేసింది.

చెప్పొద్దూ, నాకు కలలు కనడం అంటే చాలా ఇష్టం. అందులోనూ పగటి కలలు అంటే మరీ సరదా. కలలు కనడం అనేది ఒక రోగం అని, కొన్ని రోగాలకి అవే కారణం అనీ, మనకున్న రకరకాల రోగాలేమిటో కనుక్కోడానికి మన కలలు కూడా ఆధారమనీ ఇమ్మా ఇలాంటి మనకి అర్థం కాని 'కలా' శాస్త్ర విషయాలు ఫ్రాయిడ్ అనే మానవుడు భలేగా కనిపెట్టాడు. మన పవిత్ర భారతీయులు అంత విపరీత వ్యాఖ్యానాలు చేయకుండ కలయో, వైష్ణవ మాయయో అని రెండు ముక్కల్లో తేల్చి పారేశారు. అదీ మన కల్చరు గొప్పతనం. ప్రతీ చిన్న విషయానికీ డొంకంతా లాగరు మన వాళ్ళు. ఒకవేళ లాగారో , దొరలు ఎందుకూ పనికి రారు మన ధాటీ ముందు. - అమెరికాలో తెలుగు సాహిత్యం డిపార్ట్మెంట్ లో ఉన్న వారందరికీ తరచూ వచ్చే ఈ 'కలకలార్భాటాలు' సదరు ఫ్రాయిడ్ గారి బాబు గారికి కూడా కరతలామలకం కావు అని నా సరికొత్త స్వంత అభిప్రాయం.



సూర్యాకాంతం, ఛాయాదేవి, జూనియర్ శ్రీరంజని, శాంతకుమారి, హేమలత, అచలా సచ్‌దేవ్, టున్ టున్ మొదలైన వాళ్ళకీ నాకూ ఉన్న అవినాభావ సంబంధం ఏమిటంటే, వాళ్ళెవరూ ఏ నాడూ నా కలల్లోకి వచ్చి నన్ను ఏ విధంగా నూ బాధించలేదు ఇన్నేళ్ళుగా! ఈ విషయం వాళ్ళకి తెలిసి ఉంటే ఎంత బాధ పడి ఉండే వారో కదా! ఎందుకో తెలీదు

కానీ సావిత్రి, అంజలీ దేవి, జమున , జయలలిత- ఈ నాటి ముఖ్యమంత్రి జయలలిత కాదు

బాబోయ్ - నాటి హీరోయిన్ జయలలిత మొదలైన వాళ్ళు  ఆ రోజుల్లో అస్తమానూ కలలోకి వచ్చి దోరకమైన ఇబ్బంది పెట్టే వారు. ఈ మధ్య కూడా కొంతమంది తెలుగు సినిమా హీరోయిన్లు అప్పుడప్పుడు నా కలల్లోకి వచ్చి నన్ను హాయిగా పడుకోనీకుండా బాధిద్దామని తంటాలు పడుతూ ఉంటారు. కానీ నాకు వాళ్ళని చూస్తే చికాకు. ఎందుకంటే వాళ్ళతో హాయిగా తెలుగులో మాట్లాడుకోడానికి వీల్లేదు కదా! మన తెలుగు సినిమాలలో హీరోయిన్లంతా ఇంపోర్టెడ్ వాళ్ళే కదా! ఎంత సినిమా హీరోయిన్ అయినా అరవంలోనూ, ఉర్దూ లోనూ అరక్షణం దాటి మాట్లాడలేం కదా!

మొన్న శుక్రవారం రాత్రి ఒక్క తెలుగు సినిమాలో కూడా నటించని ఒక పిల్ల ... చూడ్డానికి పిల్లి కళ్ళతో బాగానే ఉంది సుమా.. నా కలలోకి రావడానికి అవస్థ పడుతూ ఉంటే నాకు కోపం వచ్చి ఆవిడని భయపెట్టి తరిమెయ్యడానికి శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం అని దండకం మొదలుపెట్టాను. ఎప్పుడైనా దెయ్యాలూ, భూతాలూ కలలోకి వస్తే ఆంజనేయ స్వామి దండకం చదువుకోమని నా చిన్నప్పుడు మా అందరికీ నేర్పింది మా అమ్మమ్మ.   దెయ్యాలే భయపడి నప్పుడు ఆఫ్టాల్ సినిమా హీరోయిన్ హడిలి పోకుండా ఎలా ఉంటుందీ అని నా లాజిక్కు! పైగా సినిమా తారలని రప్పించుకోడానికి కానీ, తరిమెయ్యడానికి కానీ ఏ మంత్రం పఠించాలో మా అమ్మమ్మకి,  ఆ మాట కొస్తే ఎవరికీ తెలియదేమో!  దండకం ధాటికి  వగలాడి నా కలలో నుంచీ మరొక అమెరికా తెలుగు రచయిత కలలోకి పారిపోయింది. ఎందుకైనా మంచిదని, ప్లాన్ 'బి' ప్రకారం కూడా మా బెడ్ పక్కనే బల్ల మీద ఉన్న మా అమ్మా, నాన్నల ఫోటో మీద చెయ్యివేసి పడుకున్నాను. అప్పుడు రాత్రి 4:32 అయింది.

కాసేపటికి కొన్ని వేల సంవత్సరాల నాటి ఒక ఆదిమానవుడు ఈటే, బల్లెం మొదలైన - ఆయుధాలతో బాటు కనిపించాడు. మొహం మటుకు అచ్చు 'నా మొహం' లానే ఉంది. కానీ మొల చుట్టూ ఆకులు, అలములు కట్టుకుని ఉన్నాడు. నా పోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి కాబట్టి ఈ ఆదిమానవుడు మా పూర్వీకుడని బ్రిలియంట్ గా అనలైజ్ చేసి కనిపెట్టేశాను... కానీ కనీసం ఈకదో, తోలుదో అయినా జంధ్యం మాత్రం వేసుకోలేదు ఆ మానవుడు. అఫ్ కోర్స్, పెళ్ళికోసం ఏనాడో వేసుకున్న నా 'వీరతాడు' ఎప్పుడు మా బీరువాలో మా ఆవిడ చీరల మధ్య

దాక్కుంటుంది. ఈ జంధ్యం ఫేషన్ ఈయన టైము దాటి పోయి కొన్ని వేల సంవత్సరాల తర్వాత వచ్చి ఉంటుంది అని నా అనుమానం. 'వీరతాడు' మాట దేముడెరుగు, నా అంతటి 'గొప్పవాడు' కూడా అలా బాణాలూ-బల్లేలూ వాడిన వాళ్ళ వంశంలో పుట్టవలసి వచ్చింది కదా అని ఎంతో సిగ్గేసి, మనస్సు చివుక్కు మంది. నేను 'గొప్ప వాడి' ని అని ఊరంతా అనుకుంటూ ఉంటారని నేను అనుకుంటూ ఉంటాను. అదే కదా ప్యూర్ తెలుగు వాడి లక్షణం. సరిగ్గా చూద్దునుకదా, పెద్ద మనిషి చేతిలో ఉలి లాంటిది పెట్టుకుని అక్కడే రాతి మీద 'నాగబు' లాంటి తెలుగు మాటలు చెక్కుతున్నాడు. ఇంతలో హఠాత్తుగా తెలుగు అక్షరాలు మాయమై పోయి ఉత్తుత్తి ఖాళీ రాయి మటుకు మిగిలింది. మరి కొన్ని వేల సంవత్సరాలు గడిచాక రాయి స్థానంలో తాటాకులు, వాటిమీద పక్షి ఈకతో కంద పద్యం వ్రాస్తున్న మరొక ముత్తాత గారు ప్రత్యక్షమయ్యారు. తరువాత రాగిరేకులు, వాటిమీద కావ్యాలూ, పిమ్మట పట్టువస్త్రములు దండిగా ధరించి అదో రకమైన కలంతో, నేరేడి పళ్ళ జ్యూస్ లాటి సిరాతో 18వ శతాబ్దం నాటి కాగితాలమీద బరబరా రామ కోటి రాసి పారేస్తున్న మరొక పెద్దాయన, మిగిలిన వాళ్ళందరి తోటీ కలిసి విలాసంగా నాకేసి చూసి నవ్వుతున్నారు. వీళ్ళందరి మొహాలూ నా మొహంలాగే ఉండ బట్టి వాళ్ళందరూ మా తాతలే అనీ, పాఠకులలో ఎవరి ముత్తాతలూ కాదనీ సగర్వంగా , సవినయంగా మనవి చేసుకుంటున్నాను. ఇలా మా పూర్వీకులందరూ తెలుగు చేతివ్రాత అనేక వేల సంవత్సరాలు ఎలా అభివృద్ధి పొందిందో నాకు ప్రత్యక్షంగా ఫ్లాష్ బాక్ చూపిస్తుంటే నాకు పౌరుషం తన్నుకొచ్చింది. అప్పుడు నేను నాదగ్గర ఎంతో పొందికతో ఉన్న బాపు, ఎన్.టి.రామారావు, శ్రీశ్రీ లాంటి వారి స్వంత దస్తూరీలు వాళ్ళందరికీ చూపిస్తూ "చూశారా, మా తరంలో తెలుగు చేతి వ్రాత లిపి ఎంత చక్కగా ఉందో" అంటు సంబరపడుతుండగా, చాకలి పద్దుకంటే అధ్వాన్నంగా ఉన్న నా ఒరిజినల్, స్వంత చేతివ్రాత ప్రత్యక్షమయి నన్ను వెక్కిరిస్తోంది. ఇంతలో హఠాత్తుగా చేతివ్రాతలు ఉన్న కాగితాలన్నీ మటుమాయమై పోయాయి. వాటి స్థానంలో కొన్ని వేల కంప్యూటర్ స్క్రీన్స్ , కీ బోర్డులు విలయతాండవం చేస్తూ ఇంగ్లీషులో ఎడ పెడా తెలుగు వాక్యాలూ, కధలూ, కవిత్వాలూ రాసి పారేస్తున్నాయి. పెన్నూ, కాగితం అక్కర లేకుండ, తెలుగు భాషని ఇంగ్లీషు లిపి లో అనేక

వందల మంది అలా రాసి పారేయడం చూస్తే నాకు ఎందుకో ముచ్చెమటలు పట్టేశాయి. ముందు ముందు ఇంగ్లీషు టైపు కొట్టడం వస్తేనే కానీ తెలుగులో ఏమీ రాసే పరిస్థితి కనపడడంలేదు. అతి త్వరలోనే వాయిస్ రికగ్నిషన్ టెక్నాలజీని తెలుగు కి అన్వయిస్తే మనం హాయిగా బెడ్ మీద పడుకుని, సీలింగ్కేసి చూస్తూ, తెలుగులో ఏమైనా మాట్లాడితే ఆ వాగుడంతా తెరమీదనో, గోడమీదనో మరెక్కడో తెలుగు లిపిలో ప్రత్యక్షమౌతుంది కాబోలు. ఇక తెలుగు చేతివ్రాత చూడాలంటే గుళ్ళూ, గోపురాలూ చూడ్డానికి వెళ్ళినట్టే ఇండియా వెళ్ళాలి కాబోలు. తెలుగు వ్రాత లిపి అమెరికాలో ఇక బాల్చీ తన్నేసినట్లే అనిపించగానే నాకు గుండె దడ వచ్చేసింది.

" ఏమిటా వెధవ మూలుగు, మళ్ళీ వచ్చిందా  ఐశ్వర్యారాయో-రప్పోనూ నీ కలలోకి" అని మా ఆవిడ నడ్డిమీద వడ్డించింది మూగమనసులు సినిమాలో "మొహం చూస్తేనే డోకులు, నీ మొహానికి వేవిళ్ళు కూడానా" అని రాధాదేవి అల్లు రామలింగయ్య అంటున్న ధ్వనితో క్రిందటి శనివారం తెల్లారగట్ల నాలుగు గంటల నలభై రెండు నిముషాలకి.

తెల్లారగట్ల వచ్చే కలలు నిజమౌతాయని అంటారు. ఈ ఒక్క కల నిజం అవకుండ ఉంటే ఎంత బావుంటుందో..!

